ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 13.01.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దేశంలో యువశక్తి సామర్థ్యాన్ని గుర్తించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని రంగాల్లో వారిని భాగస్వామ్యులను చేస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
2. రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.
3. మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.
4. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మున్సిపాలిటీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.

----------------------------

**కిషన్ రెడ్డి**

దేశంలో యువతకు యువశక్తికీ కొదవలేదని, ఆ యువశక్తి సామర్థ్యాన్ని గుర్తించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని రంగాల్లో వారిని భాగస్వామ్యులను చేసి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పెండ్యాల గ్రామంలో జరిగిన స్వామి వివేకానంద ఛాలెంజ్ కప్ టోర్నమెంట్ ను ఈరోజు ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. క్రీడలను, యువ క్రీడాకారులను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నైపుణ్యం కలిగిన క్రీడాకారులను కేంద్ర

ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. మనదేశంలో కామన్వెల్త్ క్రీడలు, ఒలంపిక్స్ ను కూడా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటోందన్నారు.

**జీఎస్**

--------------------------

**నియామకాలు**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో కొత్తగా ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన 1257 మంది అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు నియామక పత్రాలు అందజేశారు. హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణను ఆరోగ్య రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో 70 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. ఒక్క ఆరోగ్య శాఖలోనే ఇప్పటివరకు 9వేల 572 పోస్టులను భర్తీ చేశామని, మరో 7వేల 267 పోస్టుల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చే రిపోర్టులే డాక్టర్లకు ప్రామాణికమని, రిపోర్టుల్లో ఖచ్చితత్వం ఎంతో ముఖ్యమని అన్నారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రోగుల పట్ల సానుకూలంగా, ప్రేమతో వ్యవహరించాలని సూచించారు. ల్యాబ్ టెక్నిషియన్లు డాక్టర్లకు కళ్లు, చెవులుగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ సురేఖ ఓం ప్రకాష్ , వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

**డెస్క్**

--------------------------

**మేడారం రివ్యూ**

ఈనెల 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని

మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మేడారం జాతరపై సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రులు మాట్లాడుతూ, ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. సమ్మక్క–సారలక్క జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని అధికారులకు పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకుగాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్ ఆవిష్కరించారు.

**జీఎస్**

---------------------------

**మంత్రి వివేక్ వెంకటస్వామి..**

రాష్ట్ర సమగ్రాభివృద్దే లక్ష్యంగా మున్సిపాలిటీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈరోజు సిద్దిపేట జిల్లా దుబ్బాకలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న వడ్లకు బోనస్ లాంటి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు.

**పీటీసీ - సిద్దిపేట**

---------------------------

**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ రోజు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

**బైట్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**PTC-B. KGM**

----------------------------------

**బండి సంజయ్**

హన్మకొండ జిల్లాలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు.  ఈరోజు స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కేందర్ మంత్రి మీడియాతో మాట్లాడుతూ.... కోరమీసాల స్వామిగా ప్రసిద్ధి చెందిన వీరభద్రుడు కోరిన కోర్కెలు తీర్చే దేవుడన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**పీటీసీ – వరంగల్**

----------------------------------

**ముఖ్యమంత్రి పర్యటన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16వ తేదీన నిర్మల్ జిల్లా పొన్కల్ గ్రామంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో ఈ రోజు సమీక్షించారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**పిటిసి నిర్మల్**

--------------------------------

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం**

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం 8 లక్షల కోట్లకు పైచిలుకు నిధులను ఖర్చు చేసినట్లు మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ వెల్లడించారు... మహబూబ్ నగర్ లో ఈ రోజు ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. జీ రాం జీ బిల్లుతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు.

**BYTE : MP DK ARUNA**

**పీటీసీ – మహబూబ్ నగర్**

----------------------------------

**పీసీసీ**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్లు తమ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రానికి నీటి వాటా విషయంలో రాజీ పడేది లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు అవినీతి, అక్రమాలను అంగీకరించబోరని, గత బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ప్రజలు నమ్ముతున్నారని, అందుకే ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు బీఆర్ఎస్ ను ఆదరించబోరన్నారు. బీఆర్ఎస్ కు గతం తప్ప భవిష్యత్తు లేదన్నారు.

**డెస్క్**

---------------------------------

**ఆర్ యూ బీ**

మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని అల్వాల్, బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ మధ్య రోడ్ అండర్ బ్రిడ్జ్ విస్తరణ పనులకు ఎంపీ ఈటల రాజేందర్ ఈరోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తడంతో పాటు.. కేంద్ర రైల్వేమంత్రిని కలిసి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ విస్తరణ పనులకు పూర్తి నిధులు కేంద్ర ప్రభుత్వమే మంజూరు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ పరిధిలోని సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, చర్లపల్లి రైల్వేస్టేషన్ల ఆధునీకరణ కోసమే రెండువేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఈటల రాజేందర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, రైల్వే డీజీయం ఉదయనాథ్, డి.యం. సంతోష్ కుమార్, సీనియర్ డి.సి.యం. అనంత్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

**పీఎస్**

---------------------------

**దీపిక**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఏడాది న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు భారత అంధ క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికను ఆహ్వానించారు. పోస్టల్ అధికారులు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా, అమరాపురం మండలంలో ఉన్న దీపిక స్వగ్రామం తంబలహట్టిని సందర్శించి, ఆమెకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ ఆహ్వానంపై స్పందిస్తూ, భారత రాష్ట్రపతి నుండి ఆహ్వానం అందుకోవడం తనకు గర్వంగా ఉందని దీపిక ఆనందం వ్యక్తం చేశారు.

**NEWSONAIR**

------------------------------

**కళ్యాణ లక్ష్మీ–షాదీ ముబారక్**

కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఈ రోజు 96 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ–షాదీ ముబారక్ చెక్కులను రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. మొత్తం 96 లక్షల పై చిలుకు విలువైన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.

**PTC - కామారెడ్డి**

-----------------------------

**ఆది శ్రీనివాస్**

స్త్రీ, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సమగ్ర శిశు సేవ విభాగం నూతన కార్యాలయ భవనాన్ని అయన ప్రారంభించి మాట్లాడారు. అంగన్వాడి కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

---------------------------

**భూభారతి దరఖాస్తులు**

భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. ఈ రోజు బీబీనగర్ తహసిల్దార్ కార్యాలయంలో భూభారతి, రిజిస్ట్రేషన్ పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు.

**పీటీసీ యాదాద్రి భువనగిరి**

--------------------------------

**జనగామ**

జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన ఐదు కోట్ల రూపాయల విలువచేసే భూములను బినామీ ఆస్తుల చట్టం కింద  అటాచ్ చేసినట్లు ఐటి శాఖ వెల్లడించింది. ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తమ కూతురు తుల్జా భవాని రెడ్డి పేరిట జనగామతో పాటు సిద్దిపేట నియోజకవర్గంలో భూములను రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ భూముల కొనుగోళ్లకు సంబంధించిన డబ్బుల ఆధారాలు వెల్లడించకపోవడంతో కేసు నమోదు చేసి ఆయా భూములను అటాచ్ చేస్తూ  ఐటీ శాఖ ఆదేశాలు ఇచ్చింది.

**పిటిసి జనగామ**

----------------------------

**మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై అవగాహన**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఈరోజు  సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో ప్రాథమిక వసతులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు.

**పీటీసీ యాదాద్రి భువనగిరి**

-------------------------------------

**ట్రాన్స్ జెండర్స్ ఉపాధికి దరఖాస్తులు...**

సూర్యాపేట జిల్లాలో అర్హులైన వాళ్లు ట్రాన్స్ జెండర్స్ ఉపాధి, పునరావాస పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారి నరసింహారావు తెలిపారు.. ఈ పథకం కింద ఎంపికైన వారికి ఒక్కొక్కరికి 100 శాతం సబ్సిడీతో 75 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామన్నారు.

**పీటీసీ - సూర్యాపేట**

------------------------------------

**గూడెం లిఫ్ట్**

మంచిర్యాల జిల్లాలోని గూడెం లిఫ్ట్ ద్వారా యాసంగి పంటలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. ఈ రోజు మంచిర్యాల జిల్లా లక్షట్టిపెట్ లో రైతులతో కలిసి మహా ధర్నా నిర్వహించారు.

**పీటీసీ మంచిర్యాల**

-----------------------------

**కోడిపందాలు**

సంక్రాంతి పండగ సందర్భంగా జూదం, కోడిపందాలు పూర్తిగా నిషేధమని, పోలీసు శాఖ నిరంతర నిఘా ఉంటుందని సూర్యాపేట జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు.. సంక్రాంతిని ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని అన్నారు.

**పీటీసీ నల్లగొండ**

---------------------------------